

SAJJAN SAMAJ
INTERNATIONAL

సజ్జన్ సమాజ్
ఇంటర్నేషనల్

సజ్జన్ సమాజ్

ఇం ట ర్నే ష న ల్

సత్కర్మలు వికసించిన చోటే ప్రపంచ శాంతి వర్ధిల్లుతుంది

SAJJAN SAMAJ
INTERNATIONAL

సందేశం

ప్రియ సజ్జనులారా!

ఈనాటి ప్రజలు అత్యాధునిక సైన్స్ & టెక్నాలజీ సౌకర్యాలతో భౌతికంగా ఎంతో అభివృద్ధిని సాధించారు. అయినప్పటికీ వ్యక్తుల మనస్సుల్లో 'అశాంతి', వ్యక్తిత్వాల్లో 'అనైతికత', సామూహిక జీవితాల్లో 'అమానవీయత', జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో వర్గాలూ, జాతుల మధ్య 'అనైక్యత' వంటి అవలక్షణాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. దీనివలన మనుషులు 'దుర్జనులు'గా మారి, తమతోటి మనుషులకు హాని తలపెట్టటమే కాకుండా, స్వయంగా తమనుతామే వినాశనానికి కూడా గురి చేసుకుంటున్నారు. ఇది నేటి మానవులకు దాపురించిన పరాకాష్ట దౌర్భాగ్యం!

మనం 'ఆధునిక విద్య'తో గొప్పగొప్ప 'ప్రొఫేషనల్స్'నైతే తయారు చేయగలుగుతున్నాం. కానీ, వారిని 'సజ్జనులు'గా మలచటంలో పూర్తిగా విఫలం అవుతున్నాం. దీనికి ప్రధాన కారణం వ్యక్తులను 'సజ్జనులు'గా మలచటానికి తప్పనిసరి అయిన ''నైతిక-ధార్మిక విద్య' ను పూర్తిగా నిర్లక్ష్యం చేయటమే.

మనిషి 'భౌతికజీవి' మాత్రమే కాక, 'నైతికజీవి' కూడా. కాబట్టి అతనికి 'ఆధునిక విద్య'తోపాటు, 'నైతిక-ధార్మిక విద్య'ను కూడా మిశ్రమంగా అందిస్తేనే వ్యక్తులు 'సజ్జనులైన ప్రొఫేషనల్స్'గా రూపొందుతారు. దీని వలన వ్యక్తుల మనస్సుల్లో 'శాంతి', వ్యక్తిత్వాల్లో 'నైతికత' సాంఘిక జీవనంలో 'మానవత' జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో వర్గాలూ-జాతుల మధ్య 'ఐక్యత' వంటి 'ఉత్తమ విలువలు' వికసిస్తాయి. తద్వారా 'ఆధునిక భౌతిక వికాసం'తో పాటు 'నైతిక-ఆధ్యాత్మిక' వికాసం కూడా కలుగుతుంది. దీనివలన మాత్రమే మనిషి జీవితం 'పరిపూర్ణమై శాంతిమయం' అవుతుంది.

తద్వారా అస్తవ్యస్తంగా ఉన్న సకల మానవ జీవన రంగాలూ అత్యంత సునాయాసంగా సంస్కరించబడి, ఒక ఆదర్శవంతమైన సమాజం నిర్మితమౌతుంది. అందుకే 'సజ్జనుల' నిర్మాణమే ధ్యేయంగా 'సజ్జన్ సమాజ్' సాంఘిక సంస్కరణా యజ్ఞం ప్రారంభించటం జరిగింది.

వ్యక్తిని సజ్జనుడిగా మలచే మౌలిక ప్రక్రియ

మనిషి మనస్తత్వం రీత్యా తాను ఏ కార్యం చేసినా దానికి ప్రేరకం అంటూ ఒకటి తప్పనిసరిగా ఉంటుంది. ఏ ప్రేరకమూ లేనిదే మనిషి ఏ కార్యమూ చేయలేడన్నది జగమెరిగిన సత్యం. మనిషిలో సహజంగా ఉండే ప్రేరకాలు రెండు. వాటిలో... ఒకటి 'నైతిక ప్రేరణ'. దీనితో పనిచేసే వారు 'ఉత్తములు'. రెండు 'ఆశా-భయాల ప్రేరణ'. దీనితో పనిచేసేవారు 'మధ్యములు'. ఇక ఏ ప్రేరకంతోనూ సక్రమంగా పని చేయనివారు 'అధములు'.

కాబట్టి

- ప్రజల్లో జన్మతః ఉన్న 'సహజ నైతిక స్పృహ'ను మరియు వారి 'అంతరాత్మ సాక్ష్యాన్ని' ప్రేరేపించాలి.
- నేటి అధికశాతం ప్రజలు ఆధునిక రాజ్యాంగబద్ధ నాగరిక సమాజంలో జీవిస్తున్నారు. కాబట్టి వారిని రాజ్యాంగబద్ధ విధులూ - బాధ్యతల అవగాహనతో ప్రేరేపించాలి.
- సమాజంలో అధికశాతం ప్రజలు ధార్మికులు. కాబట్టి వారికి వారివారి 'ధర్మశాస్త్రాల' విధి-నిషేధాల, ధర్మా-ధర్మాల అవగాహనతో ప్రేరేపించాలి.

కనుక మానవుల సంస్కరణ కోసం ఈ మూడు ప్రక్రియలను నిర్వర్తించటం తప్పనిసరి.

వ్యక్తిని అత్యంత వేగవంతంగా 'సజ్జనుడి'గా మలచే విజయవంతమైన ప్రక్రియ ఇదే!

ఈ ఉద్యమం, వ్యక్తుల్లో విలువల వికాసమే లక్ష్యంగా పనిచేస్తుంది. కనుక దీని సభ్యత్వానికి ఆస్తికులే కాక, నాస్తికులూ అర్హులే అన్నది గమనార్హం.

'సజ్జన్ సమాజ్' భావాలు – కర్తవ్యాలు:

- ప్రపంచశాంతి, సజ్జనుల సారధ్యంతోనే సాధ్యం: అదెలాగంటే...
  - మనిషి జన్మతః కలిగి ఉన్న విజ్ఞత ప్రకారం సమాజ సేవకులకి సన్మానం, సంఘ విద్రోహులకి దండన తప్పనిసరి అని ప్రతి ఒక్కరి మనస్సాక్షి ఘోషిస్తుంది.
  - చట్ట ప్రకారం ఉత్తమ పౌరులకి పురస్కారాలు, నేరస్తులకి కారాగార శిక్షలు తప్పనిసరి అని రాజ్యాంగం శాసిస్తుంది.
  - సకల ధర్మ గ్రంథాల ప్రకారం సజ్జనులకి ప్రతిఫలంగా ఇహపరాల సాఫల్యం, దుర్జనులకి ప్రతిఫలంగా ఇహ-పరాల వైఫల్యం అని ధర్మం తీర్మానిస్తుంది.

  ఈ మూడు ప్రేరకాలతో సజ్జనుల నిర్మాణం సుసాధ్యం.

- ప్రతి మానవుడు ఆ పరమసత్తా నిఘాలో ఉన్నాడు: సకల ధర్మశాస్త్రాల ప్రతిపాదిత ఆ పరమసత్తా సర్వోన్నతమైనది. మానవుడు తాను చేసే ప్రతీ కర్మను గూర్చి ఆ పరమసత్తాకు సమాధానం చెప్పుకోవలసి ఉంది. సకల ధర్మశాస్త్రాల ప్రబోధిత ఈ సత్యం, వ్యక్తిని సజ్జనుడిగా మలచటానికి ఒక బలమైన ప్రేరకం.

- ధార్మిక మహనీయుల ఆదర్శాలే ప్రతివ్యక్తికి శిరోధార్యాలు: సకల ధార్మిక మహనీయుల జీవితాలు ఆదర్శమైనవి. వారిలో ఉన్న నైతికత, మానవత, ఐక్యత, ప్రేమా, త్యాగశీలత అనే సులక్షణాలు వ్యక్తి జీవితానికి చక్కటి నమూన.

- ఏకాత్మ భావనతోనే సకల మానవులకు ఆత్మగౌరవం, సమానత్వం లభిస్తుంది: విశ్వజనులందరూ ఒకే ఆత్మ నుండి ఉద్భవించారు. ఇదే ఏకాత్మ భావన. దీనివలన నల్లవారు-తెల్లవారు, ప్రాచ్యులూ-పాశ్చాత్యులు అనే నిమ్నోన్నతా భావాల వైరం సమసిపోయి, యావత్ మానవాళిలో మైత్రీ, ఆత్మగౌరవం, సమానత్వం జనిస్తుంది.

- సశాస్త్రీయ ఆలోచనతోనే మానవాళి అభివృద్ధి సాధ్యం: హేతుబద్ధమైన ఆలోచనా, ఆచరణ కలిగి, మూఢనమ్మకాలూ - మూఢాచారాలు విడనాడి, సశాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ప్రవర్తిస్తేనే ఒకవైపు మానవుడు అభివృద్ధిని సాధిస్తాడు. మరోవైపు సజ్జన్ సమాజ్ నిర్మాణం జరుగుతుంది.

- పర్యావరణ పరిరక్షణతోనే స్వీయరక్షణ సాధ్యం: మానవాళి ప్రశాంత మనుగడకు పర్యావరణ పరిరక్షణ అత్యంత ఆవశ్యకం. ఎందుకంటే పర్యావరణమే మనిషి మనుగడకి ఏకైక ఆధారం. అందుకే ప్రతి మానవుడు తన చుట్టూ ఉన్న ప్రకృతిని కాపాడుకోవాలి. అందులో భాగంగా ఈ భూమిపై ఉన్న ప్రతిజీవి మనుగడ సాఫీగా సాగేలా, జీవ వైవిధ్యం ఉండేలా పరిరక్షించుకోవాలి.

- సమాజం పట్ల ఉదారత కలిగి ఉండటం ప్రతి మానవుని బాధ్యత: సమాజం పట్ల కృతజ్ఞతా భావం కలిగి ఉండాలి. ఎందుకంటే ఎవరు ఏ స్థాయిలో ఎదిగినా అది సామాజిక సమిష్టి సహకారమే అయి ఉంటుంది! కనుక ప్రతి ఒక్కరి సంపదలో, సంతోషంలో కుటుంబ సభ్యులకి, బంధుమిత్రులకి, బీదసాదలకి హక్కు ఉంటుంది. ఈ వాస్తవాన్ని గుర్తించి, అవసరార్థులకి సాధ్యమైనంత సహకారం బాధ్యతగా భావించి అందిస్తుండాలి.

- వర్గాలూ, జాతులు అంతర్గతంగా, బహిర్గతంగా సంఘటితం కావాలి: ఆయా దేశాల్లో ఉన్న వర్గాలు, జాతులు ఎవరికివారు అంతర్గతంగా బలోపేతంగా ఉంటూ, పరస్పరం సంఘటితంగా ఉండాలి. అయితే ఈ ప్రక్రియ జాతీయ, విశ్వజనీన ప్రయోజనాలకు లోబడి జరగాలి. దీనితోనే ప్రపంచ శాంతి సాధ్యమౌతుంది.

'సజ్జన్ సమాజ్'లో సవినయ ఆహ్వానం!

రండి! సదాలోచనా, సచ్ఛీలత, నైతికత, మానవత, ప్రేమా, త్యాగాల వంటి విలువలతో అలంకృతమై 'సజ్జనులు'గా రూపొంది, మన చుట్టుప్రక్కల వారినీ 'సజ్జనులు'గా మలుద్దాం. తద్వారా నరక ప్రాయంగా మారుతున్న మన సమాజాన్ని స్వర్గధామంగా నిర్మించుకుందాం. ఇదే 'సజ్జన్ సమాజ్ సందేశం'.

భారత జాతి వికసించాలి - ప్రపంచ శాంతి వర్ధిల్లాలి

సజ్జన సిద్ధాంతాలు

1. సజ్జన సారధ్యంతోనే ప్రపంచశాంతి సాధ్యం. సత్కర్మలే దైవ ప్రసన్నతకి, ముక్తికి ఆధారం.
2. ధర్మశాస్త్రాల ప్రతిపాదిత పరమసత్తా సర్వోన్నతమైనది, అది మన సకల కర్మలను గమనిస్తుంది.
3. మహనీయులందరినీ ఆదర్శప్రాయులుగా గుర్తించి వారిని అనుసరించాలి.
4. విశ్వ మానవ ఏకాత్మ భావనను, సమానత్వాన్ని గుర్తించి, సకలజనుల పట్ల ప్రేమతత్వం కలిగి ఉండాలి.
5. సశాస్త్రీయ ఆలోచన, ఆచరణా విధానాన్ని అవలంబించాలి.
6. మానవాళి ప్రశాంత మనుగడకి పర్యావరణాన్ని కాపాడుకుంటూ, జీవ కారుణ్యం కలిగి ఉండాలి.
7. మనలను పోషిస్తున్న సమాజం పట్ల ఉదార భావన కలిగి ఉండాలి.
8. మన సంపదలో బీదసాదలకి హక్కు ఉంది.
9. మానవాళి దీర్ఘకాలిక మనుగడకు జీవవైవిధ్యం ఎంత అవసరమో, సాంస్కృతిక వైవిధ్యమూ అంతే అవసరం.
10. ప్రపంచ శాంతికి దోహదపడే విధంగా ప్రజలు జాతీయ భావన కలిగి ఉండి, తమ తమ జాతులను సముద్ధరించుకోవాలి.

సజ్జన విలువలు

1. సచ్ఛీలత
2. జవాబుదారీతనం
3. ఆదర్శజీవనం
4. ప్రేమతత్వం/ సహానుభూతి
5. హేతుబద్ధ జీవనం
6. బాధ్యతాభావం
7. సేవాతత్పరత
8. ఆదరణ
9. జాతీయ భావన
10. విశ్వ భావన

SAJJAN SAMAJ
INTERNATIONAL
World Peace Thrives Where Virtues Prevail
Contact Us
info@sajjansamajinyernational.org
Contact Us
93467 94779
www.sajjansamajinternational.org
FOLLOW US
YouTube